సాక్షి ప్రకాశం

శనివారం। 14। అక్టోబర్। 2023



జగనన్నది జవాబుదారీ పాలన

సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ పాలన అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిములపు సురేష్ అన్నారు. - 10లో..



15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా నవరాత్రి ఉత్సవాలు ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.4/26.2

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఈ-డివిజనల్ మేనేజర్ ఉద్యోగానికి ఆహ్వానం

ఒంగోలు అర్బన్: నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజన్లో భాగంగా కనిగిరి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకుగాను కంట్రాక్టు పద్ధతి మీద ఈ-డివిజనల్ మేనేజర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని కలెక్టర్ కార్యాలయం ఈ నెల 11వ తేదీ విడుదల చేసిన నోటిఫికేషన్లో పొందుపరిచినట్లు వివరించారు. నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి 15 రోజుల్లోపు విద్యార్హత పత్రాలను జత చేసిన దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

14 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మార్కాపురం టౌన్: విజయదశమి పండుగను పురస్కరించుకుని మార్కాపురం స్పోర్ట్స్ అండ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 సాయంత్రం 5 గంటల నుంచి డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులతోపాటు ఇన్స్టిట్యూషన్ టీమ్స్ అర్హులని ఆయన తెలిపారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ రూ.12 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ రూ.8 వేలు, నాల్గవ రూ.6 వేలు, క్వార్టర్ ఫైనల్ రన్నర్స్‌కు రూ.2 వేలను నాలుగు టీమ్స్‌కు అందజేస్తారన్నారు. వివరాలకు 97032 44003, 70228 38353 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జిల్లా స్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన జూడో క్రీడాకారులు

సింగరాయకొండ: పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్- 14, 17 జిల్లా స్థాయి బాల బాలికల జూడో క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల నుంచి బాల బాలికలు సుమారు 100 మంది ఈ ఎంపికలకు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కే వనజ, జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు షేక ఖాజామస్తాన్, సెక్రటరీ ఏ రవి, పీఈటీలు నర్రా కోటేశ్వరరావు, చక్కా వెంకటేశ్వర్లు, పిల్లి హజరత్తయ్య పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఒంగోలు: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాల్స్‌కు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారన్నారు. క్రిస్టియన్, మైనార్టీ పాఠశాలలకు మాత్రం ఈనెల 21 నుంచి 24 వరకు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ సెలవుల్లో ప్రైవేటు పాఠశాలలు ఎట్టి పరిస్థితులలో తరగతులు నిర్వహించరాదని, ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారులు/ఉప విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్వో శ్రీలతతో జిల్లా సైనిక సంక్షేమ సంఘ నాయకులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలతతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా సైనిక సంక్షేమ సంఘం నాయకులు, జిల్లా సైనిక బోర్డు అధికారులు కోరారు. ఈ మేరకు స్థానిక ప్రకాశం భవన్‌లోని డీఆర్ఓ చాంబర్‌లో సాయంత్రం బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలు, భూ సమస్యలు, యుద్ధ వితంతువులు-యుద్ధ క్షతగాత్రుల సమస్యలను కూడా డీఆర్ఓ దృష్టికి తీసుకెళ్లారు. మాజీ సైనికుల రిజర్వేషన్ల అమలు తదితర వాటి పరిష్కారంపై కూడా సమీక్షించారు. సమీక్షలో సైనిక సంక్షేమ అధికారి యం.రజనీ కుమారి, ఎల్‌టీ సీఓఎల్ జీ.శ్రీనివాసాచార్యులు, అసోసియేషన్ నాయకులు నెప్పల్లి నాగేశ్వరరావుతో పాటు బోర్డు సభ్యులు కూడా పాల్గొన్నారు.

పంట నమోదు పక్కా

ఎలాంటి సాంకేతిక సమస్యలకు తావులేకుండా పకడ్బందీగా ఈ- పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. సున్నా వడ్డీ పంట రుణాలతో పాటు పంట నష్టపరిహారం, బీమా, పంట కొనుగోలుకు ఇదే ప్రామాణికం కావడంతో చిన్నపాటి లోపాలకు ఆస్కారంలేని రీతిలో నమోదు చేశారు. ఈ నెల 9వ తేదీతో ఈ ప్రక్రియ పూర్తయింది. 98 శాతం మంది రైతులు నమోదు చేసుకున్నారు.

- 98 శాతం మంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదు
- ఖరీఫ్‌లో 3.55 లక్షల ఎకరాల్లో సాగు
- అత్యధికంగా 1.32 ఎకరాల్లో కంది సాగు
- మే 1 నుంచి ఈ నెల 9వ తేదీ వరకూ నమోదు
- నిరంతరం పర్యవేక్షించిన వ్యవసాయ శాఖ అధికారులు
- ఆర్‌బీకేల్లో వివరాలు



ఒంగోలు సెంట్రల్: అన్నదాత ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగ అభివృద్ధికి, అన్నదాతలకు అండగా ఉండేందుకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకూ ప్రయోజనం కల్పించాలన్న లక్ష్యంతో ఈ-క్రాప్ పేరుతో పంటల నమోదు కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అంటూ ఈ రంగాన్ని చిన్న చూపు చూసి రైతులను తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి చేసింది. దీనికి భిన్నంగా నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన సంస్కరణలు, వినూత్న పథకాలతో వ్యవసాయాన్ని పండుగ చేసి చూపిస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ హయాంలో పెండింగ్ పెట్టిన క్రాప్ బీమా నగదును అందించింది. తర్వాత కాలంలో రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించుకోవటం ద్వారా పారదర్శకంగా అనేక ప్రోత్సాహాలు అందిస్తోంది. ఈ-క్రాప్ నమోదు, వెబ్ ల్యాండ్ వివరాల ఆధారంగా రాష్ట్రంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు? ఎంత దిగుబడి వస్తుందనేది ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా మార్కెట్ సదుపాయం కల్పిస్తోంది.

3.55 లక్షల ఎకరాల్లో సాగు ..

జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 5,36,442 ఎకరాలు ఉండగా ప్రస్తుత ఖరీఫ్‌లో 3,55,132 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. 1,32,592 లక్షల ఎకరాల్లో కంది,78,550 ఎకరాల్లో మిరప, వరి 20,260 ఎకరాల్లో, సజ్జ, 11, 870 ఎకరాల్లో, పత్తి 52,852 ఎకరాల్లో, 9205 ఎకరాల్లో జొన్న, 49,803 ఎకరాల్లో రాగి, మినుము, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ఏ పథకం అమలు చేయాలన్నా ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగా, ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో పంటలు పండించే ఏ ఒక్క రైతునూ విడిచి పెట్టబోకుండా రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వారీగా ఈ-క్రాప్ నమోదు చేశారు. రైతులు సాగు చేసే పొలాలకు గ్రామ వ్యవసాయ సహాయకులు నేరుగా వెళ్లి, అక్కడే వారి ఫొటోలు తీసి ఈ-క్రాప్ నమోదు చేశారు. గతంలో ఎక్కడ తీసినా ఈ-క్రాప్ నమోదయ్యేది. నేడు అక్రమాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు చేయూత ఇచ్చేందుకు సంబంధిత భూమి వద్ద మాత్రమే అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఈ-క్రాప్ నమోదవుతుంది. ప్రతి ఎకరా ఈ-క్రాప్ చేయటమే లక్ష్యంగా వ్యవసాయశాఖ పనిచేసింది. ఈ ఏడాది మే 1వ తేదీన ఈ నమోదు ప్రక్రియ ప్రారంభించింది. ఈ నెల 9వ తేదీకి పూర్తి చేశారు. వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు ఈ ప్రక్రియను పక్కాగా చేపట్టారు. జిల్లా అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ నమోదు కార్యక్రమాన్ని తనిఖీలు చేశారు. ఇప్పటి వరకూ 3,48,882 ఎకరాలకు పంటనమోదు అయింది. అంటే 98 శాతం పూర్తయినట్లయింది.

ఈ-కేవైసీ తప్పనిసరి:

ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. లేకపోతే పంటలు అమ్ముకునే సమయంలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టం, బ్యాంకులో రుణాలు పొందే సమయంలో ఇబ్బందులు పడే అవకాశాలు ఉంటాయి. ప్రతి ఆర్‌బీకేల్లో గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు ఈ-కేవైసీ చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు సైతం ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ కేవైసీకి సంబంధించి 93 శాతం అంటే 3,22,628 ఎకరాలు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

ఎన్నో ప్రయోజనాలు:

ఈ-క్రాప్‌తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పంట నష్టం సంభవించినప్పుడు బీమా వర్తించాలంటే రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకుని ఉండాలి. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తిస్తాయి. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పొందవచ్చు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరలకే విక్రయించవచ్చు. ఈ పథకాలకు సంబంధించిన ప్రభుత్వం విడుదల జేసిన నగదు ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు బ్యాంకు ఖాతాలకే నేరుగా జమవుతాయి.

దళారులకు చెక్....

ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. చాలా మంది దళారులు పంటలు సాగు చేయకుండానే రుణాలు పొందుతున్నారు. దీంతో నిజమైన రైతులు రుణాలు పొందేందుకు వీలు లేకుండా పోతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఏయే రైతులు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేసారో ఈ-క్రాప్ చేసుకుని, దాని ఆధారంగా రుణాలు మంజూరు చేస్తోంది.



మార్కాపురం పొలాల్లో ఈ- క్రాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

> **ఈ-కేవైసీ తప్పనిసరి**
>
> 
>
> ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. రైతులు పంట దిగుబడులు అమ్ముకునేందుకు, ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్నప్పుడు పంటల బీమా అందాలంటే ఈ-క్రాప్‌తో పాటు కేవైసీ కూడా తప్పనిసరి. క్షేత్ర స్థాయిలో వీఏఏలు, వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించటంతో ఎక్కువ శాతం నమోదు చేసుకున్నారు.
>
> - ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ఒంగోలు

ప్రజల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయం

- పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం
- అన్ని రకాల అనారోగ్యాలకు ఉచిత వైద్య సేవలు, మందులు
- జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



వైద్య పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ప్రజల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక నగరంలోని మంగమూరు రోడ్డులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం క్యాంపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారి ఆరోగ్యాన్ని కాపాడటానికే సరికొత్తగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. రూ.వెయ్యి దాటిన ఎలాంటి వైద్య సేవలకైనా ఆరోగ్య శ్రీలో అవకాశం కల్పించి పేదల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని సమర్ధవంతంగా నడిపిస్తూనే మరోవైపు ప్రతి వార్డు, గ్రామ సచివాలయం పరిధిలో ఇప్పటికే ప్రతి ఇంటింటికీ ఏఎన్ఎంలను, ఆశా వర్కర్లను, వలంటీర్లను పంపి వైద్య పరీక్షలు చేయించారన్నారు. ఆ తరువాత అయా యూపీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఆధారంగా వైద్య పరీక్షల కేంద్రాలు నిర్వహించి మరీ ఉచితంగా మందులు ఇస్తున్నారని చెప్పారు. ఏమైనా పెద్ద వ్యాధులుంటే ఆరోగ్య శ్రీ రెఫరల్ వైద్యశాలలకు పంపుతారని వివరించారు. ఈ అవకాశాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మంచిని గుర్తించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుస్తోందని వివరించారు. అందుకే ఒంగోలు నగరంలో 25 వేల మందికి పైగా పేద ప్రజల సొంతింటి కలను బాలినేని శ్రీనివాస రెడ్డి నెరవేరుస్తున్నారని కొనియాడారు. టీడీపీ నాయకులు ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు కల్పించినా వెనకడుగు వేయకుండా బాలినేని ముఖ్యమంత్రికి చెప్పి నిధులు రాబట్టి రైతుల వద్ద నుంచి భూములను ల్యాండ్ పర్చేజ్ స్కీమ్ ద్వారా కొనుగోలు చేసి మరీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనునిత్యం పేదల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సరికొత్త పథకాలు ప్రవేశపెట్టి వారి బాగోగులు చూస్తోందన్నారు. ఇటీవల జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టి దాదాపు 9 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు క్యాంపులో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంతా కుమారి భాస్కర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, గంటా రామానాయుడు, పార్టీ నాయకులు నాగూర్, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన జగన్ నినాదం



విద్యార్థినులతో వైఎస్ విజయమ్మ

ఒంగోలు: జై జగన్ అంటూ విద్యార్థినులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ఒంగోలులోని పవిత్ర కాలేజీ క్యాంపస్ మార్మోగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి వైఎస్ విజయమ్మ ప్రైవేటు కార్యక్రమంలో భాగంగా ఒంగోలు వచ్చారు. స్థానిక పవిత్ర క్యాంపస్ (శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీ బాలికల క్యాంపస్) ఎదురుగా ఉన్న ఒక ప్రముఖ వ్యక్తితో మాట్లాడి బయటకు వస్తుండగా క్యాంపస్‌లో ఉన్న విద్యార్థినులు ఒక్కసారిగా బయటకు వచ్చారు. సిబ్బంది అదుపు చేస్తున్నా విద్యార్థినులు ససేమిరా అన్నారు. ఒక్కసారిగా వారందరినీ తోసుకుంటూ ముందుకు వచ్చారు. వారి ఉత్సాహాన్ని చూసిన విజయమ్మ విద్యార్థినులను దగ్గరకు తీసుకున్నారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేవు. జై జగన్ అంటూ విద్యార్థినులు నినదిస్తూ ఆమెను కలిసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆమెకు షేక్ హ్యాండ్స్ ఇస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

- జేసీ కె.శ్రీనివాసులు, ఎమ్మెల్యే బుర్రా



'జగనన్నకు చెబుదాం' స్పందనలో ఎమ్మెల్యే బుర్రాతో కలిసి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కే.శ్రీనివాసులు

పామూరు: ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందని, ఆ దిశగా మండల స్థాయి అధికారులు బాధ్యతగా పని చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కే.శ్రీనివాసులు, ఎమ్మెల్యే, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక అనిల్ గార్డెన్స్ కల్యాణ మండపంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ స్పందనకు వచ్చిన వినతుల్లో అధిక శాతం రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి వచ్చాయన్నారు. ముఖ్యంగా భూముల ఆన్‌లైన్, పాస్‌పుస్తకాలు, సాగు భూముల పంపిణీ కోసం వచ్చాయన్నారు. స్తంభాలు, కొత్తలైన్ల ఏర్పాటు, వీధిలైట్ల మెయింటినెన్స్ పై వినతులు వచ్చాయని చెప్పారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని పుట్టంనాయునిపల్లె గ్రామానికి చెందిన రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో తోట అజయ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నారదముని, ఉమాదేవి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, తహసీల్దార్ అవుల సురేష్, ఎంపీడీవో ఊట్ల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్ రెడ్డి, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, సింగిల్‌విండో ఛైర్మన్ పువ్వాడి వెంకట సుజాత, సర్పంచ్ రాగమ్మ, యాదాల సాయికిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు పాల్గొన్నారు.

వివిధ సమస్యలపై వచ్చిన ప్రధాన అర్జీలు:

సమస్యల పరిష్కారం కోసం 694 అర్జీలు వచ్చాయి. వాటిలో ఒడా పరిధి నుంచి పామూరును తొలగించాలని స్థానికులు అర్జీ ఇచ్చారు.

- సర్వేనంబర్ 200/2 గ్రామకంఠ భూమి అని.. దేవస్థాన భూమిగా రికార్డులో ఉందని దీంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచాయని సమస్యల పరిష్కరించాలని సర్పంచ్ రాగమ్మ, ఉపసర్పంచ్ యాదాల సాయి కోరారు.
- పామూరులో లోవోల్టేజి సమస్య పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు అర్జీ ఇచ్చారు.
- మదన వేణుగోపాలస్వామికి చెందిన సర్వేనంబర్ 164లో అక్రమంగా లేఅవుట్‌వేశారని తొలిగించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.
- వికలాంగులకు 2008 లో ఇచ్చిన స్థలాలను స్థానిక నాయకులు ఆక్రమించి అమ్ముకున్నారని సంఘం అధ్యక్షుడు హజరత్ తెలపగా 10 రోజుల్లో సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు.
- కోడిగుడ్లపాడు, పోతవరం, జంగాలపల్లె గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేసి ఆదుకోవాలని సర్పంచ్ కొండబాబు కోరారు.

జిల్లాకు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మంజూరు

- వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం జగన్ నిర్ణయం
- వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేస్తూ ఆదేశాలు జారీచేయడం పట్ల మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వచ్చిన వివరాలను ఆయన విశ్లేషిస్తూ ఈ నిర్ణయం ప్రకటించారు. దీనిపై బాలినేని స్పందిస్తూ పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ ప్రభావం వల్ల దశాబ్దాలుగా కిడ్నీ సమస్య వేధిస్తోందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆధునిక వైద్యం అందించేందుకు ఒంగోలు, కనిగిరి, మార్కాపురంలలో డయాలసిస్ యూనిట్లను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ఇవన్నీ వ్యాధిగ్రస్తులకు అందించే సేవలు మాత్రమే అన్నారు. అలా కాకుండా కిడ్నీ వ్యాధికి గురికాకుండా సంబంధిత ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే సీఎం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనివల్ల సంబంధిత ప్రాంతాల్లో పరిశోధనలు నిర్వహించడం ద్వారా వ్యాధికి మూల కారణాలను అన్వేషించి పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరలోనే పూర్తిచేసుకోవడం ద్వారా సంబంధిత ప్రాంతాల్లో ఫ్లోరైడ్ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, అదే విధంగా కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కూడా ప్రారంభమైతే పశ్చిమ ప్రకాశం వాసులు ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించినట్లే అన్నారు.

> **కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రకటన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్లే**
>
> 
>
> జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇటీవల వలంటీర్లు ప్రతి కుటుంబాన్ని సందర్శించి సర్వే నిర్వహించిన సంగతి తెలిసిందే. అదే విధంగా వైద్య సిబ్బంది కూడా ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు రక్త పరీక్షలతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీటన్నింటినీ సేకరించడం ద్వారా ప్రకాశం జిల్లాలో పలు ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారికి వైద్యం అందించడంతోపాటు కేసుల సంఖ్య పెరగకుండా క్రమంగా దానిని నిర్మూలించేందుకు రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం భావించడంతోపాటు సమావేశంలో అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తక్షణ ఆదేశాలు జారీచేశారు. తాము ఆ సమావేశంలో ఉన్నా సీఎం తక్షణ ఆదేశాలతో ఒకింత ఆశ్చర్యానికి గురయ్యాం. మనిషి ప్రాణాలకు ఉన్న విలువను సీఎం గుర్తించారు కనుకే ఆయన పెద్ద ఎత్తున వైద్యానికి నిధులు కేటాయిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభంలోనే ప్రకాశం జిల్లావాసులకు ఒక మహత్తరమైన మేలును చేకూర్చినట్లయింది.
>
> - డాక్టర్ యాదాల అశోక్‌బాబు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు స్పెషల్ ఆఫీసర్

క్లుప్తంగా

రేపు హ్యాండ్ వాషింగ్ డే

ఒంగోలు సిటీ: గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే సందర్భంగా అక్టోబర్ 15వ తేదీ ప్రతి పంచాయతీలో విధిగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జి.వి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలందరినీ కలుపుకుని చేతులను పరిశుభ్రంగా ఉంచుకునే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్టు

మార్కాపురం: స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థినిపై లైంగికదాడి కేసులో నిందితుడైన లెక్చరర్ గోవిందనాయక్‌ను శుక్రవారం మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ వద్ద దిశ డీఎస్పీ శ్రీనివాసరావు అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి దిశ డీఎస్పీ గత రెండు రోజులుగా మార్కాపురంలో సమగ్ర విచారణ చేపట్టి, నిందితుడిని అరెస్టు చేశారని వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 12 మందికి జైలు

ఒంగోలు సబర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందికి జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పోలీస్ అధికారులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వరశర్మ సమక్షంలో ట్రాఫిక్ పోలీసులు హాజరుపరచగా 12 మందికి ఒక్కొక్కరికి 7 రోజుల చొప్పున న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. ఇద్దరు వ్యక్తులకు రూ.10 వేల చొప్పున జరిమానా కూడా విధించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ మలికాగర్గ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులదే బాధ్యతని స్పష్టం చేశారు.

డీసీఆర్‌బీ ఎస్సైకి ఎస్పీ అభినందనలు



ఒంగోలు సబర్బన్: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన డిస్ట్రిక్ట్ క్రైం అండ్ రివ్యూ బ్యూరో (డీసీఆర్‌బీ) ఎస్సై ఎం.శ్రీనివాసరావును ఎస్పీ మలికాగర్గ్ శుక్రవారం అభినందించారు. ఆయన బాపట్ల జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో ప్రశంసపత్రం అందజేశారు.

జగనన్నది జవాబుదారీపాలన

- బాబు జమానాలో అన్నీ స్కాములే..
- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ పాలన అందిస్తున్నారని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం వైపాలెం మండలంలోని వీరభద్రాపురం గ్రామ సచివాలయ పరిధిలోని గడ్డమీదిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాలు పథకాలను సంక్షేమ క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని, విదేశాలకు వెళ్లి చదువులు అభ్యసించే విద్యార్థులకు రూ.కోటి వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు పచ్చనేతలు వంతపాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులను అడ్డుకోవటానికి ప్రయత్నించారని విమర్శించారు. గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.7 లక్షలకు పైగా లబ్ధిపొందిన పేదలు ఉన్నారని, ఇంకా ప్రజల అవసరాలు తెలుసుకునే ఉద్దేశంతో గడప గడపకు వస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబునాయుడికి ఏదో ఒక విధంగా అధికారం కట్టబెట్టాలన్న ఆలోచనతో పచ్చ మీడియా చేస్తున్న కుటిల ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లపై పచ్చనేతలు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ పథకాలు తాముకూడా కొనసాగిస్తామంటున్న పచ్చనేతలను నిలదీయాలని ప్రజలకు సూచించారు.

బాబు పాలన అవినీతిమయం

టీడీపీ అధికారంలో ఉండగా రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ చేయకపోగా భారీగా అవినీతికి పాల్పడ్డారని మంత్రి సురేష్ విమర్శించారు. 2014లో తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అవినీతికి తెరలేపారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో వందల కోట్లు కాజేసి రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఊచలు లెక్కబెడుతున్నారని, ఇంకా ఆయనపై అనేక కేసులు ఉన్నాయని, వాటిలో లోకేష్ హస్తం కూడా ఉందన్నారు. బాబు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ఏకంగా తన జనసైనికులను టీడీపీకి తాకట్టు పెట్టారని చెప్పారు. పచ్చపత్రికలు మాత్రం బాబు అవినీతిని కప్పిపుచ్చేందుకు అడ్డగోలు రాతలు రాస్తున్నాయని, వాటిని జనం నమ్మే పరిస్థితి లేదన్నారు. ముందుగా తాగు నీటి అవసరాలుతీర్చే డీప్ బోరును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మందుల ఆదిశేషు, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌లు ఆశీర్వాదం, డి.సుబ్బారెడ్డి, నాయకులు వెన్నా మోహన్‌రెడ్డి, బి.బాలచెన్నయ్య, ఎంపీడీవో వై.వి.నాగేశ్వర ప్రసాద్, డీటీ విజయభాస్కర్, డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఏపీఎం ఆర్.కృపమ్మ, వైద్యాధికారి షేక్.నాయబ్‌రసూల్, ఎంఈఓ పి.ఆంజనేయులు, ఏఈలు శ్రీకాంత్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న దామోదరరావు

ఒంగోలు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం యూనియన్ ఒంగోలు డిపో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సహకారంతో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే యూనియన్ పనితీరు నచ్చి పెద్ద సంఖ్యలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఇతర యూనియన్ల నుంచి తమ యూనియన్‌లోకి చేరేందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామంటూ వారికి దండలు వేసి ఆహ్వానించారు. ఆర్టీసీ నుంచి పీటీడీగా మారేనాటికి ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపు సంఘంగా ఉండేదని, నేడు కూడా 25,559 మంది సభ్యత్వంతో బలీయంగా ఎదుగుతోందని అన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ కృషి వలనే ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే పదోన్నతులు ఇచ్చేందుకు ఆర్టీసీ ఎండీ అంగీకరించారన్నారు. సరెండర్ లీవు, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు సెటిల్‌మెంట్ ఇవ్వాలని, విలీనానికి ముందు ఆర్టీసీ ఉద్యోగులకు ఉన్న వైద్య సౌకర్యాలు కొనసాగించేలా చూడాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ ఓవర్‌టైమ్ డ్యూటీ, నైట్ హాల్ట్, డే అవుట్స్ డ్యూటీ అలవెన్స్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జీ నారాయణరావు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో జరిగిన అంగీకారం మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలు చెల్లించాలని, అరియర్స్ చెల్లింపుతో పాటు దసరాకి 2022 జూలై డీఏ కూడా ఇవ్వాలని కోరుతున్నామన్నారు. సర్క్యులర్ 1/2019 ద్వారా జారీచేసిన ఉద్యోగ భద్రత మార్గదర్శకాలను కొంతమంది అధికారులు ఉల్లంఘించే యత్నాలు మానుకోవాలని, అటువంటి అధికారులపై ఎండీ తక్షణమే చర్యలు తీసుకోవాలని మరో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, ఏపీజేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ స్వరూపారాణి, జోనల్ సంయుక్త కార్యదర్శి బెజవాడ రవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పొదిలికి చేరిన 'ఐక్యతా విజయ పథం'

- నేతపాలేన్ని సందర్శించిన మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్



విజయకుమార్‌ను సత్కరిస్తున్న సానికొమ్ము శ్రీనివాసరెడ్డి

పొదిలి: మాజీ ఐఏఎస్ జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ చేపట్టిన ఐక్యతా విజయ పథం పాదయాత్ర శుక్రవారం పొదిలికి చేరుకుంది. స్థానిక నేతపాలెంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై బండి అశోక్ తదితరులతో విజయకుమార్ చర్చించారు. ఐక్యతా విజయ పథం యాత్ర ఉద్దేశం గురించి వివరించారు. తొలుత విజయకుమార్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పొదిలి ఒకటో సచివాలయం కన్వీనర్ పావులూరి భానుప్రసాద్, ఆరిక రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డి తల్లిని పరామర్శించిన విజయమ్మ



మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మను పరామర్శిస్తున్న విజయమ్మ

ఒంగోలు: మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ పరామర్శించారు. శుక్రవారం రోడ్డుమార్గంలో ఒంగోలులోని సుబ్బారెడ్డి నివాసానికి చేరుకున్నారు. అనంతరం పిచ్చమ్మ ఆరోగ్య స్థితిగతులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

పోక్సో కేసులో బాలుడికి మూడేళ్ల శిక్ష

ఒంగోలు సబర్బన్: ప్రకృతి విరుద్ధ లైంగిక చర్యకు పాల్పడిన పోక్సో కేసులో బాలుడికి మూడు సంవత్సరాల శిక్ష విధిస్తూ శుక్రవారం జువైనల్ జస్టిస్ బోర్డు తీర్పు చెప్పింది. ఆ మేరకు ఎస్పీ మలికాగర్గ్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. చీమకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019 ఆగస్టు 25 మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో 3 సంవత్సరాల వయసున్న ఒక బాబుకు 16 సంవత్సరాల వయసున్న మరో మైనర్ బాలుడు గొట్టాల ప్యాకెట్ కొనిస్తానని ఆశచూపి ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి ప్రకృతి విరుద్ధ లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన అప్పటి ఒంగోలు డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాదు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే కళావతి ప్రాసిక్యూషన్ తరపున వాదించగా, సాక్ష్యాధారాలతో నేర నిరూపణ జరిగి జువైనల్ జస్టిస్ బోర్డు చైర్మన్ అండ్ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ పి.భానుసాయి మైనర్ బాలుడికి మూడేళ్ల శిక్ష విధించారు. ఆ కాల వ్యవధిలో ఒక సంవత్సరం పాటు ఏదైనా ప్రభుత్వ హాస్పిటల్లో కమ్యూనిటీ సర్వీసు చేయాలని తీర్పునిచ్చారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పోలీస్ సిబ్బంది సమస్యలకు సత్వర పరిష్కారం

- పోలీస్ గ్రీవెన్స్‌లో ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని పోలీస్ సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్(గ్రీవెన్స్ డే) సందర్భంగా సిబ్బంది సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. ఓరల్ ఎంక్వైరీ, సస్పెన్షన్ నుంచి రిలీవ్, హోం గార్డుల బదిలీలు తదితర సమస్యలపై సిబ్బంది ఇచ్చిన అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఆయా అర్జీలను వేగంగా పరిష్కరించాలని డీపీఓ అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ ఎం.సులోచన, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ఏఆర్ ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, స్పందన ఎస్సై సుదర్శన్‌తోపాటు డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి (ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్) ఎం.లక్ష్మణరావు సూచించారు. స్థానిక త్రోవగుంట పొగాకు బోర్డులో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మణరావు, జిల్లా హార్టీకల్చర్ అధికారి వై.గోపీచంద్, ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు, కేవీకే శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా పొగాకు సాగు పెరిగినందున డిమాండ్ తగ్గిందని చెప్పారు. పొగాకు బోర్డు అనుమతి మేరకే పండించాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ మాట్లాడుతూ మన నేల స్వభావాన్ని బట్టి సుగంధ ద్రవ్య పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మన వాతావరణ పరిస్థితులను బట్టి శనగ, మినుము, ధనియాలు, రబీలో కంది, బొబ్బర్లు, జొన్న, కొర్ర, కుసుమ, మొక్కజొన్న, మిరప, రాగులు, పెసర సాగు చేసుకోవాలని చెప్పారు. ఒంగోలు–2 వేలం నిర్వాహణాధికారి కోవి రామకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు కౌలుకు భూములు, బ్యారన్‌లు తీసుకోవద్దని, ఒక్కో బ్యారన్‌కు 3,550 కేజీలకు మాత్రమే అనుమతి ఉన్నందుకు రైతులు విస్తారంగా పొగాకు సాగు చేయవద్దని కోరారు. బోర్డు మెంబర్ ఎం.సుబ్బారెడ్డి, వై.వెంకట శేషయ్య, ఒంగోలు–1, 2, వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి మంత్రి సురేష్ సంతాపం



సుబ్బయ్య(ఫైల్)

పుల్లలచెరువు: మండలంలోని మల్లాపాలెం సర్పంచ్ మంగినపల్లి సుబ్బయ్య మృతిపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్పంచ్ సుబ్బయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందించిన సుబ్బయ్య మృతి దురదృష్టకరమన్నారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, ఎంపీటీసీ రాములు తదితరులు సంతాపం తెలిపారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, తెల్లకార్డుదారులు సమీపంలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ–కేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ కోరారు. ఎటువంటి గ్యాస్ కనెక్షన్ లేని వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని చెప్పారు. జిల్లాలో దాదాపు పది వేల నూతన కనెక్షన్లు మంజూరయ్యాయని, అవసమైన వారు సమీపంలోని ఏజెన్సీలను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
తూర్పు గంగవరం బ్రాంచ్
తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా-523264
మొబైల్ నెం: 8928001901, ఇమెయిల్:ubin0801909@unionbankofindia.bank

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

దిగువ తెలిపిన వ్యక్తి యొక్క న్యాయవారసులు లోన్ అకౌంట్‌లో బకాయిలను చెల్లించడంలో విఫలమయ్యారని ఇందు మూలంగా తెలియజేయడమైనది. వారికి బ్యాంకు సిబ్బంది ద్వారా నోటీసులు పంపబడినవి. కావున వారు బకాయి మొత్తాన్ని మరియు ఇతర చార్జీలను 18.10.2023న తేదీ ఆలోగా చెల్లించి తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విడిపించుకోవాలని వారిని కోరడమైనది. లేనిచో బ్యాంకు ఏకైక విచక్షణ మేరకు ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా 18.10.2023న సా.4.00 గం॥లకు బ్యాంకు ఆవరణలో జరిగే బహిరంగ వేలంలో రుణగ్రహీత వ్యయం వంతున సదరు సెక్యూరిటీలు బ్యాంకుచే విక్రయించబడును.

లోన్ తేది	లోన్ నెంబరు	రుణగ్రహీత పేరు చిరునామా
29.11.2018	019030100260317	కొమ్మిరెడ్డి హనుమాయమ్మ భర్త వెంకటేశ్వరరెడ్డి బెల్లంకొండవారిపాలెం గ్రామం, తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా. ఏ.పి–523264.

అథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తూర్పు గంగవరం బ్రాంచ్

రికవరీ ఆఫీసర్-II కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
(ఆర్థిక సేవల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
31-31-21, నారాయణ్ భవనం, సాయిబాబా వీధి, దాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530 020

డిమాండ్ నోటీసు
(రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్ రప్సీ యాక్ట్, 1993లోని సెక్షన్స్ 25 నుండి 28 మరియు ఆదాయ పన్ను చట్టం, 1961కి రెండవ షెడ్యూలులోని రూల్ 2 క్రింద ప్రకటన)
O.A. No.656 of 2017లో R.P.No.176 of 2019
ది ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్, ఒంగోలు బ్రాంచ్, ప్రకాశం జిల్లా
వర్సెస్
శ్రీ షేక్ మూసా

To:
(CDR 1) శ్రీ షేక్ మూసా తండ్రి షేక్ ఇస్మాయిల్, ప్రొప్రైటర్: మూసా ఐరన్ అండ్ సిమెంట్ ట్రేడర్స్, డి.నం. 1-294, ఇస్లాంపేట ఎక్స్‌టెన్షన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523002.

OA/656/2017లో గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే ఆమోదించబడిన ఉత్తర్వులకు అనుగుణంగా జారీచేయబడిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం మొత్తం రూ.39,29,676/- (ముప్పైతొమ్మిది లక్షల ఇరవైతొమ్మిది వేల ఆరువందల డెబ్బైఆరు రూపాయల మాత్రమే) తోపాటు వ్యాజ్యకాలంలో మరియు 01-07-2017 నుండి వసూలు అయ్యే వరకు పెండింగ్ వాయిదాలతో సంవత్సరానికి 22% వంతున భవిష్య వడ్డీ మరియు వ్యయాలు మీపై (ఉమ్మడిగా మరియు విడిగా/పూర్తిగా/పరిమితంగా) బకాయిగా ఉన్నాయని తెలియ జేయడమైనది.

2. ఈ నోటీసు స్వీకరణ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తాన్ని మీరు చెల్లించాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది, లేనిచో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993 మరియు అందులోని నియమాలకు అనుగుణంగా రికవరీ చేయబడును.

3. మీ ఆస్తుల వివరాల అఫిడవిట్‌ను విచారణ తదుపరి తేదీన లేదా ఆలోగా వెల్లడించాలని ఇందుమూలంగా మిమ్మల్ని ఆదేశించడమైనది.

4. తదుపరి ప్రొసీడింగ్స్ కోసం 20/10/2023 తేదీన ఉ.10.30 గం.కు దిగువ సంతకందారు సమక్షంలో హాజరవ్వాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది.

5. పైన తెలిపిన మొత్తానికి అదనంగా మీరు దిగువ విధంగా చెల్లించడానికి బాధ్యులై ఉన్నారు:
(ఏ) సర్టిఫికెట్ / ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించవలసిన అర్థి వడ్డీలు.
(బి) ఈ నోటీసు మరియు వారంట్లు అందించడానికి మరియు మొత్తం బకాయిని రాబట్టుకోవడానికి తీసుకున్న ఇతర ప్రక్రియలు మరియు అన్ని ఇతర ప్రొసీడింగ్స్‌కు సంబంధించి అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులు.
నాచే స్వయంగా ఈ ట్రిబ్యునల్ సీలుతో 23/06/2023న ఇవ్వబడింది

సం/- (B.N.S.V.S.K. బంగార్రాజు), రికవరీ ఆఫీసర్

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



బాలాత్రిపురసుందరీదేవి ఆలయం

త్రిపురాంతకం/మార్కాపురం/టంగుటూరు: దసరా నవరాత్రి ఉత్సవాలు ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో ఏర్పాట్లను ఈఓ చెన్నకేశవరెడ్డి వివరించారు. బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారు 15న త్రిపురసుందరిగా, 16న బ్రహ్మచారిణి, 17న చంద్రఘంట, 18న కుష్మాండ దుర్గ, 19న స్కందమాతగా, 20న కాత్యాయనిగా, 21న కాళరాత్రిగా, 22 దుర్గాష్టమి రోజున మహాదుర్గగా, 23 మహర్నవమి రోజున సిద్ధిదాయినిగా, 24 విజయ దశమి రోజున రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. ప్రత్యేక పూజలు, వాహనసేవల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

- మార్కాపురం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవాల సందర్భంగా అమ్మవారిశాల వీధిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి రూపాలతో భారీ విద్యుత్ కటౌట్లు ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బారావు, కోశాధికారి రామడుగు వెంకట రమేష్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అలాగే పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వాలిచర్ల కేశవరావు, ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. జ్ఞాన సరస్వతి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- టంగుటూరు మండలం వల్లూరులోని వల్లూరమ్మ తల్లి ఆలయంలో 15వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



హాజరైన యువతీ యువకులు

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్
- కనిగిరిలో జాబ్ మేళాకు విశేష స్పందన

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించినట్లు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక జీసీఅండ్‌వైపీఎస్ (ఎంఎస్‌ఎం) డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా శుక్రవారం నిర్వహించారు. జాబ్‌మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 500 మంది యువతీయువకులు పాల్గొన్నారు. వారిలో 61 మందికి ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ఎంఎస్‌ఎం కళాశాలల అధినేత ఏలూరి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో 1.30 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకం యువతకు వరమన్నారు. జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత బంగారు భవిష్యత్తుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. తొలుత ఎమ్మెల్యేను ఎంఎస్‌ఎం కళాశాలల అధినేతతోపాటు అధికారులు ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధికల్పన అధికారి టి.భరద్వాజ్, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైస్ చైర్మన్ పులి శాంతి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, ఎంఎస్‌ఎం కరస్పాండెంట్ ఏలూరి నరేన్, ఉపాధి కల్పన అధికారి రాజారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.